
# లక్ష్మీనగరం ఏపీజీవీబీ ఎదుట నిరసన

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ
- రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

దుమ్ముగూడెం, ఆగస్టు 21 : ఆంక్షలు లేకుండా రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం లక్ష్మీపురం ఏపీజీవీబీ ఎదుట ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మండలంలోని అన్ని బ్యాంకుల్లో రుణ మాఫీ కోసం 5,843 మంది రైతులు అర్హులు కాగా.. వారిలో కేవలం 3,451 మంది మాత్రమే మాఫీ పొందారని.. మిగిలిన 2,391 మంది రైతులకు మాఫీ కాలేదని మండిపడ్డారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో రైతు బంధును బంద్ పెట్టారని, ఇటు రైతుబంధు రాక.. అటు రుణమాఫీ కాక రైతులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ అమలు చేసేంతవరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడు, అధికార ప్రతినిధి జానీపాషా, సోషల్ మీడియా అధ్యక్షుడు దామెర్ల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు కొత్తూరు సీతారామారావు, నోముల రామిరెడ్డి, బొల్లి వెంకట్రావు, దన్ని అప్పారావు, పొడియం సుబ్బారావు, మడకం రామారావు, కుర్సం సోమయ్య, మోతుకూరి శ్రీకాంత్, కటిబోయిన వెంకటేశ్వర్లు, సీతారాం, నూపా సీతయ్య, జంజూరి జయసింహ, జెట్టి రామకృష్ణ, గోసంగి కిరణ్, జిలకర గంగరాజు, జంగిటి రాము, కల్లూరి కామేశ్వరరావు, బొల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఏపీజీవీబీ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

# మాఫీపై నిరసనల పరంపర




## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆందోళనలకు దిగిన రైతాంగం

- షరతులు, కొర్రీలు లేకుండా రూ.2 లక్షలు మాఫీ చేయాల్సిందే..
- కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- పేరాయగూడెంలో దీక్షకు దిగిన ఇద్దరు రైతులు




రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉమ్మడి జిల్లా రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించిన మూడు జాబితాల్లో తమ పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందిన రైతులు పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంట సీజన్ షురువైనా.. సాగు పనులు పక్కన పెట్టి రుణమాఫీ కోసం ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రుణమాఫీపై ఇచ్చిన మాట తప్పడంపై మండిపడ్డారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలన్నీ ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా మాఫీ చేయాలని పట్టుబట్టారు. బీఆర్ఎస్, తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టగా.. రైతులు కూడా స్వచ్ఛందంగా దీక్షకు పూనుకున్నారు. పలువురు రైతులు చేపట్టిన ఆందోళనలకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

*- ఖమ్మం, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

## చంద్రుగొండ రైతు వేదిక ఎదుట రైతుల ఆందోళన

చంద్రుగొండ, ఆగస్టు 21 : అర్హులైనా మా రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు చంద్రుగొండ రైతు వేదిక ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతులకు రుణాలు ఇచ్చేటప్పుడు లేని షరతులు.. మాఫీ చేసేటప్పుడు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. రైతులను రుణ విముక్తులను చేస్తామని, రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. రేషన్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం వంటి షరతులు పెట్టకుండా.. అర్హులైన రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అయితే రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతుల దరఖాస్తులను ప్రజావాణిలో తీసుకోవడం లేదని, ఎక్కువ రుణం ఉంటే దరఖాస్తులు తీసుకోరా? అని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


చంద్రుగొండ రైతు వేదిక ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

## రుణమాఫీపై రైతుల దీక్ష

### షరతులు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్

### రైతుల దీక్షకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 21 : ఎలాంటి షరతులు లేకుండా రైతుల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పేరాయగూడెం గ్రామానికి చెందిన రైతులు నైనారపు వెంకటేశ్వరరావు, నార్లపాటి సిద్దయ్యలు దీక్ష చేపట్టారు. గ్రామంలోని రింగురోడ్డు సెంటర్‌లో బుధవారం రైతులు చేపట్టిన దీక్షకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు పలికింది. రైతులకు మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి పూలమాల వేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ మాట్లాడుతూ రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులకు ఎలాంటి షరతులు, కొర్రీలు పెట్టకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణ మాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేదంటే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, జుజ్జురపు శ్రీరామ్మూర్తి, చిప్పనపల్లి బజారయ్య, చైతన్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


పేరాయగూడెంలో రుణమాఫీ చేయాలని స్వచ్ఛందంగా దీక్ష చేస్తున్న రైతులు

## తహసీల్ ఎదుట ధర్నా

### తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి

దుమ్ముగూడెం, ఆగస్టు 21 : రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో దుమ్ముగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు బొల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల కార్యదర్శి కొడాలి లోకేశ్‌బాబు మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు చెప్పిన విధంగా అందరికీ షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా వరకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, అసైన్డ్ భూముల్లో పొజిషన్‌లో ఉన్నందున అడంగల్, పహాణీపై రుణాలు తీసుకునే వారికి కూడా రుణమాఫీ వర్తింపచేసి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య, ఎలమంచి శ్రీనుబాబు, బొల్లి సాయిబాబు, సమ్మక్క, కాకా కామయ్య, కృష్ణ, యాసా శ్రీనివాసరెడ్డి, తెల్లం ధర్మయ్య, రమణయ్య, వాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## చింత తీరని చింతల్‌తండా

- 130 మంది అన్నదాతలకు కాంగ్రెస్ మొండి 'చేయి'
- రుణమాఫీ కాలేదని గొంతెత్తి అరుస్తున్న గిరిజన రైతులు
- కనీసం రూ.35 వేలు రుణం కూడా మాఫీ కాలే..
- బ్యాంకు వద్ద ధర్నా చేస్తామంటున్న రైతులు

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : జూలూరుపాడు మండలం చింతల్‌తండా గ్రామంలో రైతులకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపింది. గ్రామంలో 130 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని గొంతెత్తి అరిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామానికి చెందిన ధరంసోత్ పద్మకు పోడు పట్టా ఉంది. ఆనాడు పోడు చేసి సంపాదించిన హక్కు పత్రం కూడా ప్రభుత్వం ఇచ్చింది. గత కేసీఆర్ సర్కారు ఆ మహిళా రైతుకు రైతుబంధు, రుణమాఫీ కూడా ఇచ్చింది. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు రూ.35 వేల రుణమాఫీ కూడా చేయలేకపోయింది. దీంతో కాంగ్రెస్ చేతిలో తాము మోసపోయామంటూ ఆ మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నది. తనలాంటి రైతులు గ్రామంలో చాలామంది ఉన్నారని చెబుతున్నది.

### బ్యాంకు దగ్గర ధర్నా చేస్తాం..



మా ఊర్లో అందరికీ అన్యాయమే జరిగింది. అందరూ రూ.లక్ష లోపు అప్పు తీసుకున్న వాళ్లమే. గుట్టపక్కన పోడు చేసుకుని బతుకుతున్నాం. మాకు మూడు రంగుల పార్టీ చుక్కలు చూపిస్తున్నది. మాకు న్యాయం జరగకపోతే బ్యాంకు దగ్గర ధర్నా చేస్తాం. అధికారులు మా ఊరు వచ్చి లెక్కలు చూడండి.. మా బతుకులు చూడండి.

**– భూక్యా శోభ. చింతల్‌తండా, మహిళా రైతు**

### రెక్కల కష్టం మీదే బతుకుతున్నాం..



వ్యవసాయాన్నే నమ్ముకొని రెక్కల కష్టం మీద బతుకుతున్నాను. సాగు చేస్తేనే కూడు ఉంటది. మాలాంటి పేద రైతులకు కూడా అన్యాయం ఎలా చేయబుద్ధి వేసింది కాంగ్రెస్ ప్రభుత్వానికి. గత కేసీఆర్ ప్రభుత్వంలో నాకు రైతుబంధు వచ్చింది. రుణమాఫీ కూడా అయ్యింది. ఇప్పుడున్న రూ.35 వేల బాకీ కూడా మాఫీ కాలే. బ్యాంకు వాళ్లు తప్పు చేశారా, అధికారులు తప్పు చేశారా చెప్పాలి.

**– ధరంసోత్ పద్మ, చింతల్‌తండా, జూలూరుపాడు మండలం**

### కేసీఆర్ మంచిగా మాఫీ చేశాడు



నా పేరు ధరావత్ లక్ష్మా, కొత్తతండా(పి), టేకులపల్లి మండలం. నాకు 8ఎకరాల భూమి ఉంది. రెండు ఎకరాలు పత్తి, ఆరు ఎకరాలు మిర్చి తోట, రెండు ఎకరాలు కౌలు భూమిలో వరి సాగు చేస్తున్న. గత పది సంవత్సరాలుగా బ్యాంక్‌లో వ్యవసాయ లోన్ తీసుకొని వ్యవసాయం చేస్తున్న. గడిచిన మూడు సంవత్సరాలుగా మిర్చి తోటలో భారీ నష్టం వచ్చింది. ఒక బ్యాంక్‌లో రూ.లక్షా 30 వేలు, మరో బ్యాంక్‌లో రూ.లక్షా 50 వేల లోన్ ఉంది. గతంలో కేసీఆర్ రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా చేసిన వెంటనే లోన్ ఇచ్చాడు. కాని ప్రస్తుతం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నది. రైతులను ఇబ్బందిపెడితే ఏ ప్రభుత్వానికైనా భవిష్యత్ ఉండదు.

**– ధరావత్ లక్ష్మా, కొత్తతండా(పి), టేకులపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

### పెట్టుబడికే డబ్బులు లేవు...



నాకు నాలుగెకరాల భూమి ఉంది. దానిపై బ్యాంక్‌లో మూడు లక్షల అప్పు ఉంది. ప్రస్తుతానికి నాకు రెండు లక్షల అప్పు మాఫీ కావాలంటే ముందుగా ఒక లక్ష బ్యాంక్‌లో కట్టాలని బ్యాంక్ అధికారులు అంటున్నారు. వ్యవసాయ పెట్టుబడులకే డబ్బులు లేని స్థితిలో అప్పు కట్టాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం అంటే రైతుల కష్టాలను తెలుసుకొని రైతులకు ఏ టైంలో ఏమి కావాలని ఆలోచించి అందించేలా ఉండాలి కానీ అప్పు కడితే రుణమాఫీ అంటే రైతుల ఉసురు తీసినట్టే.

**– మాలోత్ బాలాజీ, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు, టేకులపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

### కార్డులేక మాఫీ జరగలేదు..



నాకు రేషన్ కార్డు లేని కారణంగా కుటుంబ ధ్రువీకరణ జరగలేదని రుణమాఫీ కాలేదు. ఇప్పటికే రుణమాఫీ కోసం వ్యవసాయాధికారికి దరఖాస్తు ఇచ్చాను. విచారణ పూర్తి చేసి రుణమాఫీ చేస్తారంట. అది ఎప్పుడు వస్తుందో అని ఎదురుచూస్తున్నా. రుణమాఫీ పొందాలంటే రైతులు ఇన్ని తిప్పలు పడాలా. ఇదెక్కడి న్యాయం.

**–అడపా సుబ్బారావు, మందలపల్లి, దమ్మపేట మండలం**

### రూ.80 వేలకు అర్హత ఉండదా..



రూ.2 లక్షల రుణమాఫీ పథకం మూడు విడతలుగా చేశామని ముఖ్యమంత్రి చెబుతున్నారు. మరి.. రూ.80 వేలు రుణమాఫీ ఎందుకు చేయలేదు. పట్టాదారు పాస్‌పుస్తకం, తెల్లరేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా ఉంది. అన్నీ సక్రమంగా ఉన్నా రుణమాఫీ కావడం లేదని ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి.

**–కర్రి సత్యనారాయణ, రైతు, లంకపల్లి, పెనుబల్లి మండలం**

### రూ.2 వేలకే మాఫీ చేయలేదు..



ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణ మాఫీ వర్తించలేదు. నాకు బ్యాంకులో రూ.2,02,000 అప్పు ఉంది. అయితే రూ.2 వేలు సాకు చూపించి రూ.2 లక్షల రుణమాఫీని ఆపారు. కనీసం సమాచారం ఇచ్చి రూ.2 వేలు కడితే రుణమాఫీ వర్తిస్తుందని ముందే చెబితే రూ.2 వేలు కట్టే వాడిని కదా.. ఇలాంటి సాకులు చూపి ప్రభుత్వం రుణమాఫీ చేయడం లేదు.

**–దోసపాటి హరీశ్, రైతు, లంకపల్లి, పెనుబల్లి మండలం**

### కార్డు ఆధారమంటూ కొర్రీలు..



భార్యాభర్తలం ఇద్దరం బ్యాంకులో రుణం తీసుకున్నాం. ఇద్దరి పేరున రూ.2.70 లక్షల రుణం ఉంది. కానీ.. ఇప్పుడు ఒకే కుటుంబం.. రేషన్ కార్డు ఆధారమంటూ కొర్రీలు పెడుతున్నారు. అదేదో ముందే చెబితే రూ.70 వేలు కట్టి రూ.2 లక్షలు రుణమాఫీలో ఉండేవాళ్లం. ఇప్పుడు జాబితాలో పేరు లేకపోవడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి. దరఖాస్తు అయితే ఇచ్చాం.

**–ధరావత్ బాలాజీ, రైతు, అడవిమల్లెల, పెనుబల్లి మండలం**

## రుణమాఫీపై నేడు జిల్లావ్యాప్తంగా ధర్నాలు

- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మణుగూరు టౌన్, ఆగస్టు 21 : ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టాలని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ రేగా కాంతారావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రూ.2 లక్షల రుణాలు మాఫీ అయ్యాయని చెబుతుంటే.. మంత్రులు మాత్రం ఇంకా కాలేదని చెబుతుండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు రూ.2 లక్షల రుణమాఫీ అందరికీ వర్తింపజేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లలో కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో లక్షలాది మంది రైతులు రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందన్నారు. లక్షలాది మంది రైతులకు అండగా ఉండేందుకు గురువారం అన్ని మండల కేంద్రాలతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టే ధర్నాలకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆంక్షలు లేకుండా రుణ మాఫీ అందే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి

- కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ఆళ్లపల్లి, ఆగస్టు 21 : మాజీ ఉప సర్పంచ్, కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మర్కోడు మాజీ ఉప సర్పంచ్ కమల చేసిన రోడ్డు పనులకు పర్సంటేజీగా ఎంపీవో బత్తుల శ్రీనివాస్, మర్కోడు పంచాయతీ కార్యదర్శి తాటి నాగరాజు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన ఆమె పరిస్థితిని వివరించారు. వారి సూచన మేరకు ఎంపీవో, పంచాయతీ కార్యదర్శికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రూ.15 వేలు లంచం ఇస్తుండగా.. అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా వారిని పట్టుకుని అరెస్ట్ చేశారు. దాడుల్లో ఏసీబీ సీఐలు రాజశేఖర్, మల్లేశ్, రాజు, ఆళ్లపల్లి ఎస్సై సతీశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి

# అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం..

- రాష్ట్రానికే ఒక పర్యాటక కేంద్రంగా జమలాపురం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క


ఎర్రుపాలెం, ఆగస్టు 21 : ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం జమలాపురం గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ జమలాపురాన్ని రాష్ట్రానికే వన్నె తెచ్చే విధంగా.. పర్యాటకులు రెండు రోజులపాటు జమలాపురంలో గడిపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. సాగర్ ఎడమ కాల్వ నుంచి అధికారికంగా తూము ఏర్పాటు చేయించి జమలాపురం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారుస్తామన్నారు. ఎర్రుపాలెం మండలంలో మిగిలి ఉన్న రోడ్లను పూర్తి చేసి ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లేందుకు వీలుగా రోడ్డు నిర్మించి మండలం మొత్తం ఒక రింగ్ రోడ్డులా అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే మీనవోలు నుంచి బనిగండ్లపాడు వరకు రూ.1.70 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశానన్నారు. ఎర్రుపాలెం నుంచి పెగళ్లపాడు వరకు రూ.2.40 కోట్లు, కొత్తపాలెం నుంచి గట్లగౌరవరం వరకు రూ.20 కోట్లు, ఎర్రుపాలెం వయా జమలాపురం నుంచి రాజుపాలెం వరకు రూ.25 కోట్లు, వెంకటాపురం నుంచి బనిగండ్లపాడు వరకు రూ.5 కోట్లు, బుచ్చిరెడ్డిపాలెం నుంచి వెంకటాపురం వరకు రూ.2.20 కోట్లు, నారాయణపురం నుంచి రాజుపాలెం వరకు రూ.95 లక్షలు, రాజుపాలెం నుంచి కొత్తపాలెం వరకు రూ.1.60 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క

# పర్యాటక కేంద్రంగా నేలకొండపల్లి

- భక్త రామదాసు నడయాడిన స్థలం చరిత్రకే తలమానికం
- ప్రపంచంలోనే పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఇక్కడున్నది ఒకటి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి(నేలకొండపల్లి), ఆగస్టు 21 : ఎంతో చరిత్రను తన చుట్టూ నిక్షిప్తం చేసుకున్న నేలకొండపల్లి ప్రాంతం తాను ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో ఉండడం ఎంతో గర్వంగా ఉందని, దీనిని పర్యాటక కేంద్రంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నేలకొండపల్లిలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆడిటోరియంను ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. తొలుత భద్రాచలం రామాలయ పూజారులు, స్థానిక పూజారులు కలిసి మంత్రి, ఎంపీకి వేదాశీర్వచనం చేసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రపంచంలోనే పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా ఉన్న ప్రదేశం, రాముడి గుడి కట్టిన మహనీయుడు భక్తరామదాసు నడయాడిన స్థలం నేలకొండపల్లి అని, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామన్నారు. కంచర్ల గోపన్నకు సంబంధించిన అనేక అంశాలను కళ్లకు కట్టినట్లుగా ఫొటోల ద్వారా తెలిపే విధంగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, తుళ్లూరి బ్రహ్మయ్య, కంచర్ల చంద్రశేఖర్, శాఖమూరి రమేశ్, వెన్నెపూసల సీతారాములు, నెల్లూరి భద్రయ్య, తమ్మినేని నవీన్, మాజీ ఎంపీపీ వజ్జా రమ్య, రాయపుడి నవీన్, మామిడి వెంకన్న పాల్గొన్నారు.


ఆడిటోరియంను ప్రారంభించిన మంత్రి పొంగులేటి